క్లుప్తంగా

సమ్మెకు హఫీజ్‌ఖాన్ సంఘీభావం..


సమ్మె పాల్గొన్న ఉద్యోగులతో మాట్లాడుతున్న కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఉద్యోగుల సమ్మెకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు హఫీజ్‌ఖాన్ సంఘీభావం ప్రకటించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆందోళన చేస్తున్న అప్కాస్ ఉద్యోగుల శిబిరాన్ని ఆయన సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్కాస్ కింద మున్సిపల్ కార్పొరేషన్‌లో 366 మందికి పైగా ఉద్యోగులు వాటర్ వర్క్స్, పార్కులు, వీధి లైట్ల నిర్వహణలో పనిచేస్తున్నారన్నారు. వీరికి అతి తక్కువ వేతనాలు అందుతున్నాయన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

పక్కా కొలతలతో ఆస్తి పన్ను మదింపు

కర్నూలు (టౌన్) : ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణాలకు అనుగుణంగా ఆస్తి పన్ను మదింపునకు ఇంటింటి సర్వే చేపట్టి పక్కా కొలతలు తీసుకున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. కృష్ణ అన్నారు. గురువారం పాతబస్టాండ్‌లోని చలపతి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఆస్తి పన్ను మదింపు సర్వే పరిశీలించారు. అనంతరం ఆయన నగరంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

10 గంటల పని విధానాన్ని వెనక్కు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీ క్యాబినెట్ తీసుకున్న 8 గంటల పని స్థానంలో 10 గంటల విధానాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. రాత్రి వేళల్లో మహిళలు డ్యూటీ చేయాలని తీసుకోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. గురువారం సుందరయ్యసర్కిల్‌లో పది గంటల పని విధానాన్ని నిరసిస్తూ సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు అధ్యక్షతన ఆందోళన నిర్వహించారు. సీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ..తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించడం కోసం 8 గంటల పని స్థానంలో 10 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధారప్ప, రాముడు, ప్రభాకర్, గురుశేఖర్, నగేష్‌పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో సమస్యలు



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(అర్బన్): బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని సీడీపీఓ అనురాధ, డీసీపీఓ శారద అన్నారు. గురువారం స్థానిక వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ దేవాలయంలో బాల్య వివాహం జరుగుతుందనే సమాచారం మేరకు వారు అక్కడికి వెళ్లి ఇరువురి తల్లిదండ్రులు, అమ్మాయికి కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు అమ్మాయి బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. అలాగే బాల్య వివాహాల వల్ల మాతృ, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. పుట్టబోయే పిల్లలు అంగవైకల్యంతో జన్మించే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు బాల్య వివాహమవుతున్న అమ్మాయిని తాత్కాలిక వసతి కోసం వన్ స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించినట్లు వెల్లడించారు.

సుందరయ్య సర్కిల్ నిర్మించాలి

కర్నూలు (టౌన్) : స్థానిక కొత్తబస్టాండ్ వద్ద సుందరయ్య సర్కిల్ నిర్మాణాన్ని చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాముడు విన్నవించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, రాజశేఖర్, రోశయ్య పాల్గొన్నారు.

నగరంలో రష్మి సందడి



కర్నూలు కల్చరల్ : నగరంలో గురువారం ప్రముఖ యాంకర్ రష్మి సందడి చేశారు. వెంకటరమణ కాలనీలోని ఒక షాప్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెను చూసేందుకు జనం ఎగబడ్డారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

- భవి తరాల కోసం ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి
- మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలి
- పర్యావరణ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా


ప్లాస్టిక్ వద్దు... సంచులు ముద్దు అంటూ జ్యూట్ బ్యాగులను విడుదల చేస్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం సునయన ఆడిటోరియంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలుష్య కారకాల నివారణకోసం 1972 నుంచి యునైటెడ్ నేషన్ ప్రతిజూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే అంశంపై పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. సముద్రం, భూమి, చివరకు మనిషి శరీరంలోకి కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు చేరిపోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఫలితంగా సముద్రంలో జలచరాలు చనిపోవడం , భూమిలో జలాలు ఇంకిపోవడం, మనిషికి కాన్సర్‌తోసహా పలు రకాల వ్యాధులు రావడం జరుగుతుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం కోసం విరివిగా మొక్కలునాటి సంరక్షరించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఎస్ఈ శంకర్ నాయక్ మాట్లాడుతూ..పర్యావరణ పరిక్షణ కోసం జిల్లా యంత్రాంగం వారంరోజులుగా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కళాజాతాల ద్వారా పాటలు, నృత్యాలతో ప్రజల్లో చైతన్యం కలిగించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. అంతకముందు జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, పీసీబీ ఈఈ కిశోర్‌రెడ్డి , ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. గురువారం సీఆర్ భవన్ ఆవరణలో ఆయన మొక్కలునాటారు.

ప్రకృతిని కాపాడుకుందాం


మొక్కలు నాటుతున్న ఆర్‌యూ రెక్టార్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: ప్రకృతిని పరిరక్షించుకుందామని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం వర్సిటీలో వనం - మనం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, సీడీసీ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్ భరత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోసం మొక్కలు నాటాలి

కర్నూలు(హాస్పిటల్): పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యాయలయ ఏఓ అరుణ, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎస్ఓ హేమసుందరం, డీపీఓ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

➤ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగం, వన్‌స్టాప్ సెంటర్‌ల వద్ద ఆసుపత్రి అధికారులు మొక్కలు నాటారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటంలో వైద్యులు, వైద్య సిబ్బంది తోడ్పాటునందించాలని కోరారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, పట్టణ పౌర సంక్షేమ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు, డిజైనింగ్ ఆర్కిటెక్ రఘునాథ్‌రెడ్డి, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

➤ పచ్చదనాన్ని పెంపొందించాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు.


కేఎంసీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

గురువారం కళాశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సింధియా శుభప్రద, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీలత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలి


కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): మానవ వినశనాన్ని కోరుకుంటున్న ప్లాస్టిక్ వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ..ప్రపంచ పర్యవరణాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 6న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ అశోక్‌నగర్, 11 కేవీ పంప్‌హౌస్ పీడర్‌లలో అంటే అశోక్‌నగర్, రామలింగేశ్వరనగర్, వీఆర్ కాలనీ ఏరియాల్లో ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాలుగో పట్టణ సీఐగా విక్రమ సింహ బాధ్యతల స్వీకరణ


విక్రమ సింహ

కర్నూలు : నాలుగో పట్టణ సీఐగా బి.వి. విక్రమసింహ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న మధుసూదన్ గౌడు ఓ కేసు మాఫీ చేసేందుకు రూ.80 వేలు హెడ్ కానిస్టేబుల్ రవి ద్వారా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడి జైలుకు వెళ్లారు. దీంతో విక్రమ సింహను ఇక్కడ సీఐగా నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన విక్రమ సింహ 2004లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి చిత్తూరు జిల్లాలో పనిచేశారు. 2013లో సీఐగా పదోన్నతి పొంది పత్తికొండ, శిరివెళ్ల, కర్నూలు వన్‌టౌన్, కర్నూలు అర్బన్ తాలూకా, దిశ మహిళా పీఎస్, ఆదోని వన్‌టౌన్, బద్వేలు, ఎమ్మిగనూరు రూరల్ పీఎస్‌లో పనిచేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఈయనను కర్నూలు ఫోర్త్ టౌన్‌కు నియమించడంతో గురువారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం


వైద్యులతో సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు చెప్పారు. కోవిడ్ వైరస్‌పై గురువారం ఆయన తన చాంబర్‌లో అన్ని విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని పాత గైనిక్ విభాగంలో 20 పడకలతో కోవిడ్ వార్డు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రిలో ఒక్కో విభాగం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన మందులు, వైద్యపరికరాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కోవిడ్ పరీక్షల కోసం ఓపీ నెం.99ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రస్తుత కోవిడ్ ప్రాణాంతకమైనది కాదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే ప్రతి ఒక్కరూ మాస్కులు, శానిటైజర్లు ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ బి. వెంకటేశ్వర్లు, వైద్యులు ఇక్బాల్ హుసేన్, విజయానందబాబు, విశాల, సుధీర్, వేణుగోపాల్‌రెడ్డి, దమామ్ శ్రీనివాసులు, శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలపై దృష్టి సారించాలి

కర్నూలు(సెంట్రల్): పదే పదే రోడ్డుప్రమాదలు జరిగే ప్రదేశాలపై దృష్టి సారించి నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ జిల్లా రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రమాదాలకు కారణాలను విశ్లేషించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డిని ఆదేశించారు. కర్నూలు శివారులోని ఎల్లమ్మ గుడి దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను నెల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో షెడ్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఎందుకు స్థలం కేటాయించడంలేదని జీజీహెచ్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి స్థలాన్ని కేటాయించి పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...మరి కొద్ది రోజుల్లోనే పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బస్సులు, వ్యాన్ల ఫిట్‌నెస్‌ను పరీక్షించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణపై చాలా వీడియోలు చేశామని, వాటిని నగరంలోని ముఖ్య కూడళ్లలో ప్రదర్శించేందుకు మొబైల్ వాహనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో పీఆర్ ఈఈ మద్దన్న, ఆర్‌డీఓ భరత్‌నాయక్, అడిషనల్ డీఎంహెచ్ఓ భాస్కర్, పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సంపూర్ణ విషయావగాహన


సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులతో అతిథులు

కర్నూలు కల్చరల్: పుస్తక పఠనంతో సంపూర్ణ విషయావగాహన కలుగుతుందని సెట్కూరు సీఈవో డాక్టర్ కె. వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఏప్రిల్ 28 నుంచి నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉన్నత విద్యావంతులుగా ఎదిగి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. సోమశివారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయం దేవాలయం లాంటిదన్నారు. పుస్తకాలు చదివి విజ్ఞానం పొందాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ మాట్లాడుతూ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సమ్మర్‌క్యాంప్‌లో స్వచ్ఛందంగా పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులను, ఫ్యాకల్టీని ఘనంగా సన్మానించారు. అనంతరం అతిథులు గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

పీసీసీ అధ్యక్షురాలు పర్యటనను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా కోరారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా ఈనెల 11వ తేదీన ఆమె కర్నూలుకు వస్తున్నారన్నారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కార్యకర్తల సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ..బీఎస్సీ నర్సింగ్ సెమిష్టర్ ఫీజు రూ.1800 ఉంటే రూ.2500 నుంచి రూ.3000 వరకు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే క్లినికల్ చార్జెస్ పేరుతో కూడా రూ.5 వేలనుంచి రూ.10 వేల వరకు అక్రమంగా వసూలుచేస్తున్నారని, ఈ అక్రమ ఫీజులపై ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలను సీజ్ చేయాలి

కర్నూలు సిటీ: నగరంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల వసూళ్లు చేపడుతున్నాయని, వాటిని వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. గురువారం సూర్యనారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యను వ్యాపారంగా మార్చారన్నారు. కొన్ని విద్యా సంస్థలు పాఠ్యపుస్తకాలను తమ వద్దే కొలుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. విద్యాధికారులు స్పందించి నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఆర్యన్, ఆదిత్య, పృథ్వి, హేమంత్, రుత్విక్, గ్రీష్మంత్, తదితరులు పాల్గొన్నారు.

ఓసీటీ విధానంలో మూడు వాల్వ్‌లకు స్టెంట్లు

- 68 ఏళ్ల వృద్ధునికి కర్నూలులో అరుదైన చికిత్స


ఓసీటీ మిషన్‌తో డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ అనిరుధ్‌కుమార్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫి(ఓసీటీ) విధానంలో పరీక్షించి గుండెలో బ్లాక్ అయిన మూడు వాల్వ్‌లకు మొదటిసారి స్టెంట్లు వేసినట్లు శ్రీ విజయదుర్గ కార్డియాక్ సెంటర్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. గురువారం ఆయన విజయదుర్గ కార్డియాక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.అనిరుధ్ కుమార్‌తో కలిసి నూతన విధానం గురించి మాట్లాడారు. సాధారణంగా గుండె పోటు వచ్చిన వారికి, గుండె సమస్యలున్న వారికి యాంజియోగ్రామ్ ద్వారా గుండె రక్తనాళాల పనితీరును పరీక్షిస్తామన్నారు. కానీ కర్నూలులోనే మొట్టమొదటిసారిగా (ఓసీటీ) ఇమేజింగ్ అనే విధానంలో ఎండోస్కోపీ మాదిరిగా రక్తనాళాల్లోకి ట్యూబ్‌ను పంపి స్కాన్ చేస్తామన్నారు. ఈ విధానంలో ఎక్కడ బ్లాక్ ఉంది, ఎంత మేరకు బ్లాక్ ఉంది, ఎంత పొడవు, ఎంత వెడల్పు స్టెంట్ వేయాలి లేదా ఆపరేషన్ చేయాలా అన్న విషయాలను ఈ ఓసీటీ మిషన్ నిర్ధారిస్తుందన్నారు. దీంతో చికిత్సను వంద శాతం విజయవంతం చేయవచ్చన్నారు. ఇలాంటి చికిత్సను కర్నూలుకు చెందిన 68 ఏళ్ల వృద్ధునికి గతనెల 29వ తేదీన నిర్వహించినట్లు తెలిపారు. సదరు వ్యక్తికి 26వ తేదీన హార్ట్ ఎటాక్ వచ్చిందని, పరీక్షించగా మూడు వాల్వ్‌లు బ్లాక్ అయినట్లు గుర్తించామన్నారు. కుటుంబసభ్యులు ఆపరేషన్ వద్దని చెప్పడంతో ఓసీటీ విధానంలో అతని రక్తనాళాలను పరీక్షించామన్నారు. మూడు వాల్వ్‌లు స్టెంట్ వేసేందుకు అనుకూలంగా ఉండటంతో స్టెంట్లు వేశామన్నారు. ఇలాంటి ఆధునిక చికిత్సలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాల్లో మాత్రమే నిర్వహిస్తారని, ఇప్పుడు కర్నూలులో కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

మసకబారిన డీసీసీబీ ప్రతిష్ట

- ఇంటి దొంగలతో బజారున పడుతున్న పరువు
- 2024-25లో రైతులకు అందించిన సేవలు నిల్
- పేరుకుపోతున్న నిరర్థక అస్తులు
- నేడు డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు గాడి తప్పింది. బ్యాంకులో ఇంటిదొంగలు ఎక్కువైపోయారు. ఎవ్వరికి వారు జేబులు ఎలా నింపుకోవాలనే దానిపైనే దృష్టి సారిస్తుండటంతో బ్యాంకు ప్రతిష్ట మసక బారుతోంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పాలనలో లాభాల బాట పట్టిన డీసీసీబీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రైతులకు సేవలు అందించడంలో వెనుకబడిపోయింది. బ్యాంకు ప్రతిష్టను స్వంత అధికారులు, సిబ్బందే దెబ్బతీస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆత్మకూరు బ్రాంచీలో బ్యాంకు అధికారులే రూ.కోటి వరకు కొల్లగొట్టారు. ఏడెనిమిది నెలలు అవుతున్నా..రూపాయి రికవరీ లేదు. రుణాల పంపిణీలో కమీషన్‌ల బెడద ఎక్కువైంది. దీర్ఘకాలిక రుణాలతో పాటు చివరికి పంట రుణాల పంపిణీలో కూడా కమీషన్‌ల కోసం కక్కుర్తి పడుతుండటం గమనార్హం. బ్యాంకులో ఆదాయం వచ్చే పోస్టుల కోసం పైరవీలు చేయడం ఎక్కువగా ఉంది. తమకు ఇష్టం లేని వారు పై స్థానాల్లో ఉంటే వారిపై దారుణమైన బూతులతో పిటిషన్లు పెట్టే సంస్కృతి ఎక్కువగా ఉంది. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2024-25లో లోనింగ్ పూర్తిగా పడిపోయింది. 2024 ఏప్రిల్ నెలలో డీసీసీబీ టర్నోవర్ రూ.3930 కోట్లు ఉండగా.. నేడు కూడా టోర్నోవర్ అలాగే ఉంది. నిరర్థక అస్తులు మాత్రం భారీగా పెరిగిపోయాయి. 2024 ఏప్రిల్ నెలలో నిరర్థక ఆస్తులు రూ.195 కోట్లు ఉండగా... నేడు రూ.265 కోట్లకు పెరిగిపోయాయి.

నేడు డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ...

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్‌గా డి. విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇందుకు బ్యాంకు అధికారులు అట్టహాసంగా ఏర్పాట్లు చేశారు. ఇంతవరకు జాయింట్ కలెక్టర్ నవ్య అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి పలువురు ఆ పార్టీ నేతలు హాజరు కానున్నట్లు సమాచారం.

వైద్య శాఖలో బదిలీల గుబులు

- ఐదేళ్లు ఒకే చోట పనిచేస్తే తప్పనిసరి బదిలీ
- యూనియన్ నాయకులైనా కదలాల్సిందే



కర్నూలు (హాస్పిటల్): వైద్య శాఖలో గత కొన్ని రోజులుగా బదిలీల అంశం ఉద్యోగుల్లో గుబులు రేపుతోంది. ఇందులో ప్రధానంగా ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారిలో మరింత ఆందోళన నెలకొంది. అయితే యూనియన్ నాయకులుగా ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు కాకుండా పక్కన ఉండే మరో విభాగంలో బదిలీ కోరుకునేలా చేసిన మార్పులు వారికి కాస్త ఊరట కలిగిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖలో వివిధ కేడర్లలోని వైద్యులు, పారా మెడికల్, నర్సులు, మినిస్టీరియల్, నాలుగో తరగతి ఉద్యోగులకు సంబంధించి గత నెల 31వ తేదీన బదిలీ షెడ్యూల్ ఉత్తర్వులు వెలువడ్డాయి.ఈనెల 5వ తేదీలోగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నా ఇప్పటిదాకా సీనియారిటీ జాబితా విడుదల చేయకపోవడంతో మరికొంత గడువు విధించినట్లు తెలుస్తోంది. బదిలీల్లో భాగంగా ఐదేళ్లు ఒకే చోట సర్వీస్ పూర్తి చేసుకున్నవారు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. మూడేళ్లు దాటినవారు ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నాయకులకు సైతం ఈసారి స్థానచలనం తప్పడం లేదు. అయితే వారికి స్థానికంగానే మరో విభాగంలో బదిలీ కోరుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఆయా విభాగాలు తిరిగి ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో విచారణ చేసుకుంటున్నారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే వైద్యులకు సైతం బదిలీలు ఉండటంతో పదుల సంఖ్యలో వారు బదిలీ అయ్యే అవకాశముంది. దీంతో వారిలో ఆందోళన నెలకొంది. అధిక శాతం స్థానికంగా నివాసముండే వైద్యులు, ప్రాక్టీస్ ఉన్న వారు నంద్యాల, అనంతపురం జిల్లాలకు వెళ్లేందుకు సుముఖత చూపుతున్నట్లు సమాచారం. అంతకుమించి దూరం బదిలీ వస్తే దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

కోవిడ్ కేసులు పెరుగుతున్న వేళ బదిలీలు ఎలా?

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగానే కాక జిల్లాలోనూ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. మూడు రోజులుగా కర్నూలు జిల్లాలో ఏడుగురికి కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ఇందులో ముగ్గురు వైద్యులు, వైద్య విద్యార్థులు కూడా ఉండటం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో బదిలీల షెడ్యూల్ ఎలా అమలు చేస్తారని వైద్యులతో పాటు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న వేళ బదిలీల షెడ్యూల్‌ను వాయిదా వేయాలని కోరుతున్నారు.

20 శాతం కటాఫ్‌కు బ్రేక్

రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న బదిలీల్లో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన అందరినీ ఒకేసారి బదిలీ చేసేవారు కాదు. అందులో 20 శాతం ఉద్యోగులను మాత్రమే కదిలించేవారు. దీనివల్ల పాలనకు సంబంధించి ఇబ్బందులు ఉండవనేది అధికారుల అభిప్రాయం. ప్రస్తుతం ఈ 20 శాతం కటాఫ్ జీ కూటమి ప్రభుత్వం బ్రేక్ వేసింది. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ బదిలీ కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏదైనా ఒక కార్యాలయంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయినవారు నలుగురు ఐదుగురు కీలక స్థానాల్లో ఉంటే వారందరూ బదిలీ అయితే పాలన ఇబ్బంది అవుతుందని అధికారులు భావిస్తున్నారు. వీరి స్థానంలో కొత్తవారు వస్తే వారు సబ్జెక్టు నేర్చుకోవడానికి కొన్ని నెలలు పడుతుందని, అప్పటివరకు పాలన స్తంభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.



గోతులు పోయి రాళ్లు వచ్చే !



వాహనదారులు అవస్థలు పడుకుంటూ వెళ్తున్న ఈ దారి ఎక్కడిదో కాదు. నగర నడిబొడ్డులోని కలెక్టరేట్‌లోనిదే. ఇక్కడ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ఉంటారు. అలాంటి చోట డీఈఓ కార్యాలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉంది. వర్షం నీరు ఆగుతున్నాయనో మరెమో తెలియదు కానీ గోతుల్లో సిమెంట్ పెల్లలు, కంకర రాళ్లు వేసి వదిలేశారు.చదును చేయకపోవడంతో ఈ మార్గంలో వాహనదారులు,పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు